సాక్షి
విశాఖపట్నం

ఆదివారం । 19 । అక్టోబర్ । 2025



ట్.. సేవలు బాలేవు! IIలో



బంగారు భవిష్యత్‌కు చదువే మూలం IIలో




సృజనాత్మకత, ప్రణాళికతో నాయకత్వ వికాసం IIలో

పైసలెక్కడున్నాయ్ సార్..!

వివిధ కార్యక్రమాలకు నిధులు విదల్చని కూటమి ప్రభుత్వం

- జిల్లాలో ఉన్న నిధులను ప్రభుత్వ ప్రచార ఆర్భాటానికి వినియోగం
- సీఐఐ సమ్మిట్‌కి నిధులు వెచ్చించాలని కూటమి సర్కారు ఆదేశాలు
- ఎక్కడి నుంచి తీసుకురావాలో తెలియక తలలు పట్టుకుంటున్న అధికారులు



జిల్లాకు రావాల్సిన బకాయిలు

యోగాంధ్ర	సార్వత్రిక ఎన్నికలు	ఉపాధ్యాయ ఎమ్మెల్సీ
రూ.40 కోట్లు	రూ.7 కోట్లు	ఎన్నికలు - రూ.3 కోట్లు
ప్రోటోకాల్ - రూ.30 కోట్లు		ఇతరత్రా కార్యక్రమాలకు సుమారు రూ.20 కోట్లు

సాక్షి, విశాఖపట్నం: మాటలు కోటలు దాటుతాయి.. చేతలు మాత్రం గడప దాటవు అన్న చందంగా.. కూటమి ప్రభుత్వం చేసింది తక్కువ.. ప్రచారం మాత్రం పీక్స్‌లో ఉంటోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ చంద్రబాబు అండ్ కో... ప్రచారం కోసం విచ్చలవిడిగా వినియోగిస్తుండటంతో జిల్లా ఖజానా ఖాళీ అయిపోయింది. వరుసగా ప్రభుత్వ కార్యక్రమాలు, భారీ ప్రచారాల నిర్వహణ కారణంగా జిల్లా ఖజానాపై ఆర్థిక భారం తీవ్రమైంది. ప్రభుత్వం నుంచి రూ.100 కోట్ల వరకు నిధులు పెండింగ్‌లో ఉన్నప్పటికీ, కొత్తగా సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ వంటి ప్రధాన ఈవెంట్‌లకు ఏర్పాట్లు చేయాలంటూ ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు నిధుల సర్దుబాటుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కార్యక్రమాలు, ప్రోటోకాల్ పనులకు ఉన్న నిధులే వెచ్చించాల్సి వస్తుండగా, ఆ మొత్తం తిరిగి మంజూరు కావడం లేదని, దీంతో జిల్లా అభివృద్ధి పనులకు నిధులు కరువవుతున్నాయని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సీఐఐ సమ్మిట్టా.? బాబోయ్!

2014 –19 మధ్య కాలంలో 2 సార్లు సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్స్‌ను చంద్రబాబు ప్రభుత్వం నిర్వహించింది. దానికి సంబంధించి రూ.కోట్ల బిల్లుల్ని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చెల్లించింది. ఇప్పుడు మరోసారి సీఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చెయ్యాలంటూ చంద్రబాబు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నవంబర్ 14, 15 తేదీల్లో నిర్వహణకు దాదాపు రూ.50 కోట్లకు పైగా ఖర్చయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఏర్పాట్లకు సంబంధించిన ఆదేశాలు ఇచ్చారే తప్ప.. రూపాయి ఇవ్వలేదు. ఇప్పటికే రూ.కోట్లలో బకాయిలు ఉన్న పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. అధికారులేమో ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ లేఖలు రాస్తోంది. అయినా కూటమి ప్రభుత్వం కనికరించడం లేదు. దీంతో భాగస్వామ్య సదస్సు నిర్వహణ ఏర్పాట్లు ఎలా చెయ్యాలా అంటూ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు.

ప్రోటోకాల్ పేరుతో ఊడ్చేస్తున్నారు..

వారానికో రాష్ట్ర మంత్రి, పదిరోజులకో కేంద్ర మంత్రి.. పదిహేను రోజులకు ఒకసారి ముఖ్యమంత్రి.. ఇలా ప్రతినెలా.. ప్రోటోకాల్ డ్యూటీలు, ఖర్చులే జిల్లాకు భారంగా మారుతున్నాయి. మంత్రులు, ముఖ్యమంత్రి వచ్చినప్పుడు ఏర్పాట్లు, వాహనాల కాన్వాయ్, ఇతర సౌకర్యాల కోసం నిధులు వెచ్చిస్తున్నారు. ఇవి కూడా పెండింగ్ పెడుతున్నారే తప్ప.. రూపాయి ఇవ్వడానికి చంద్రబాబు ప్రభుత్వానికి మనసురావడం లేదు. ఇలా ప్రోటోకాల్ ఖర్చులు, ఇతర కార్యక్రమాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి రూ.30 కోట్ల వరకూ జిల్లాకు రావాల్సి ఉంది. ఇవి కూడా మంగళం పాడేందుకు చంద్రబాబు సర్కారు ప్రయత్నిస్తోంది.

సార్వత్రిక ఎన్నికల బిల్లులకూ దిక్కులేదు.!

2024 ఏప్రిల్ నుంచి సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఈ ఎన్నికల నిర్వహణకు రూ.20 కోట్లకు పైగా ఖర్చు చేశారు. దీనికి సంబంధించిన బిల్లులు ప్రభుత్వానికి పంపించగా.. పలు దఫాలుగా విదిలిస్తూ కేవలం రూ.3 కోట్లు మాత్రమే చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.7 కోట్లకు పైగా పెండింగ్‌లో ఉంది. జనరల్ ఎన్నికల అనంతరం ఈ ఏడాది ప్రారంభంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు రూ.3 కోట్లు ఖర్చు కాగా ఇప్పటివరకూ ఒక్క రూపాయి కూడా ప్రభుత్వం విడుదల చేయలేదు. తరువాత జరిగిన యోగాంధ్ర కార్యక్రమానికి బడ్జెట్‌కు మించి 10 రెట్లు ఎక్కువ ఖర్చయింది. యోగాంధ్ర నిర్వహణకు జిల్లా ఖజానా నుంచి రూ.70 కోట్ల వరకూ ఖాళీ అయిపోయింది. ఈ డబ్బులు ఇవ్వాలని ప్రభుత్వానికి అనేకసార్లు మొరపెట్టుకుంటే.. కేవలం రూ.28 కోట్లు మాత్రమే విదిల్చింది. ఇలా ప్రతి కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించడం.. తర్వాత నిధులిచ్చేందుకు నిరాకరించడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిపోయింది.

న్యూస్‌రీల్

అనంతునికి పవిత్రాల సమర్పణ



పవిత్రాలతో దేవతామూర్తులు

పద్మనాభం: పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో అనంతుని పవిత్రోత్సవాల్లో భాగంగా మూడో రోజైన శనివారం పవిత్రాలు సమర్పించారు. ఆలయంలోని కుంతీ మాధవస్వామి, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభస్వామి పెద్ద ఉత్సవ విగ్రహాలు, శ్రీదేవి భూదేవి సమేత అనంత పద్మనాభ స్వామి చిన్న ఉత్సవ విగ్రహాలు, రుక్మిణీ, సత్యభామ సమేతుడైన వేణుగోపాల స్వామి, లక్ష్మీదేవిలకు గిరిపై ఉన్న అనంత పద్మనాభ స్వామికి పవిత్రాలు సమర్పించారు. ముందుగా కుంతీ మాధవస్వామి, అనంత పద్మనాభ స్వాములకు అష్టకలశ స్నపనం, పంచామృత అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పవిత్రాలను సమర్పించారు.

ఏయూలో కొత్త డీన్ల నియామకం

మద్దిలపాలెం: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో నూతనంగా నియమితులైన డీన్‌లకు ఉపకులపతి ఆచార్య జీ.పి.రాజశేఖర్ శనివారం ఉత్తర్వులు అందించారు. అంతర్జాతీయ విద్యార్థి వ్యవహారాల విభాగం డీన్‌గా ఆచార్య ఎస్.పాల్ డగ్లస్, సెక్యూరిటీ విభాగం ప్రొఫెసర్ ఇన్‌చార్జిగా ఆచార్య సి.హెచ్.ఆశ ఇమ్మానియేల్ రాజు నియమితులయ్యారు. ఇంజినీరింగ్ కళాశాల మొదటి సంవత్సరం విద్యార్థులకు కోఆర్డినేటర్లుగా ఆచార్య వై.రామకృష్ణ, ఆచార్య కె.పద్మలను నియమించారు. అంతర్జాతీయ విద్యార్థుల విభాగం అసోసియేట్ డీన్లుగా ఆచార్య ఎన్.ఎం.యుగంధర్, ఆచార్య ఎం.విజయశాంతి, యూజీ పరీక్షల అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎం.మురళీకృష్ణ కుమార్ నియమితులయ్యారు. వీరిని వీసీ ఆచార్య జీ.పి.రాజశేఖర్, రెక్టార్ ఆచార్య పి.కింగ్ అభినందించారు.

విద్యుత్ విప్లవంలో స్టార్టప్‌ల కోసం హ్యాకథాన్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఎండీ పృథ్వీతేజ్

సాక్షి, విశాఖపట్నం: విద్యుత్ సరఫరా, వినియోగంలో సరికొత్త ఆధునిక విప్లవాన్ని సృష్టిస్తూ.. డిస్కమ్‌లకు, వినియోగదారులకు ఉపయుక్తమయ్యే స్టార్టప్‌ల కోసం హ్యాకథాన్ నిర్వహిస్తున్నామని ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి అన్నారు. సృజనాత్మక ఆవిష్కరణలను రూపొందించే స్టార్టప్ సంస్థలను ప్రోత్సహించే ఉద్దేశంతో వచ్చే నెలలో హ్యాకథాన్ నిర్వహించనున్నట్లు తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన శనివారం సంస్థ ప్రధాన కార్యాలయంలో ఆవిష్కరించారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్, క్లైమేట్ కలెక్టివ్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో హ్యాకథాన్ ద్వారా స్టార్టప్‌లను ప్రోత్సహిస్తున్నామన్నారు. హ్యాకథాన్‌లో ఎంపికైన స్టార్టప్‌లు తమ పరిష్కారాలను రాష్ట్ర విద్యుత్ రంగ ప్రముఖుల సమక్షంలో ప్రదర్శించే అవకాశంతో పాటు విజేతలకు పైలెట్ ప్రాజెక్టులు, 3 డిస్కమ్‌ల్లో పూర్తి స్థాయి ప్రాజెక్టులను అమలు చేసుకునే అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ హ్యాకథాన్‌ను ఏపీఈపీడీసీఎల్, ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్‌పీడీసీఎల్‌లు సంయుక్తంగా నిర్వహిస్తున్నాయన్నారు. ఈ నెల 22 రాత్రి 12 గంటల వరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు.

సోలార్ పవర్‌కు సూపర్ బూస్ట్.. జీఎస్టీ 2.0

ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యాలయంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్



సోలార్ ప్యానెల్స్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

సాక్షి, విశాఖపట్నం: జీఎస్టీ 2.0 అమలు ద్వారా సోలార్ విద్యుత్ ప్రాజెక్టుల వంటి పునరుత్పాదక ఇంధన వనరుల ఉత్పాదనకు సూపర్ బూస్ట్ ఇచ్చినట్లని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అన్నారు. 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' ప్రచారంలో భాగంగా ఈపీడీసీఎల్ విశాఖ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్కిల్ కార్యాలయం ఆవరణలో కలెక్టర్‌తో పాటు ఈపీడీసీఎల్ డైరెక్టర్ టీవీ సూర్యప్రకాష్, ఎస్‌ఈ జి.శ్యాంబాబు మొక్కలు నాటారు. అనంతరం పీఎం సూర్యఘర్ రూఫ్‌టాప్ సోలార్ ప్లేట్స్ ప్రదర్శనను కలెక్టర్ తిలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జీఎస్టీ స్లాబ్ రేట్ల తగ్గింపు ద్వారా పునరుత్పాదక శక్తి పరికరాలపై 12 నుంచి 5 శాతనికి తగ్గించడం పెద్ద ప్రోత్సాహకమన్నారు. జీఎస్టీ 2.0 కారణంగా వినియోదారులకు రూ.10 వేలు ఆదా అవుతుందని తెలిపారు. బయో గ్యాస్ యూనిట్ ధరలో రూ.10,000, 5 హెచ్‌పీ సోలార్‌పంప్ సెట్ ధరలో కూడా రూ.29 వేల వరకూ ఆదా అవుతుందని వివరించారు. డైరెక్టర్ సూర్యప్రకాష్, ఎస్‌ఈ శ్యాంబాబు మాట్లాడుతూ ప్రతీ ఒక్క గృహ వినియోగదారులు జీఎస్టీ 2.0, పీఎం సూర్యఘర్ పథకాల ద్వారా లబ్ధి పొందాలని, రూఫ్ టాప్‌పై సోలార్ పలకలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా కాలుష్యం నివారించవచ్చని సూచించారు. కార్యనిర్వాహక ఇంజినీర్ శ్రీనివాసరావు, ఇతర విద్యుత్ శాఖ అధికారులు, సోలార్ వెండర్లు పాల్గొన్నారు. అంతకు ముందు సర్కిల్ కార్యాలయ ఉద్యోగులు, అధికారులతో కలిసి ఎస్‌ఈ శ్యాంబాబు జీఎస్టీ 2.0 అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనధికార మద్యం, డ్రగ్స్‌పై పటిష్ట నిఘా



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో అనధికార మద్యం అమ్మకాలు జరగకుండా గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో పటిష్టమైన నిఘా ఉంచాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఎక్సైజ్, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, జోనల్ కమిషనర్లతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ పలు సూచనలు చేశారు. అక్రమ మద్యం అమ్మకాలపై సమాచారం అందించడానికి గ్రామ/వార్డు కార్యదర్శులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు, శానిటేషన్ సిబ్బంది ఎక్సైజ్ శాఖకు సహకరించాలన్నారు. గంజాయి, గంజాయి చాక్లెట్లు వంటి మాదక ద్రవ్యాల అమ్మకాలను కూడా పసిగట్టి నిరోధించాలని ఆదేశించారు. స్థానికంగా మద్యం తయారీ లేదా కల్తీ మద్యం అమ్మకాలు జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉంచాలని, లేబుల్ లేని బాటిల్స్ అమ్మకూడదని స్పష్టం చేశారు. తక్కువ రేటుకు వస్తోందని నాసిరకం మద్యం తాగవద్దని ప్రజలకు సూచించారు. మహిళలకు అక్రమ మద్యం నిరోధంపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ మాట్లాడుతూ.. అక్రమ మద్యం గుర్తించడానికి ప్రభుత్వం 'ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్'ను తీసుకొచ్చిందని, దీని ద్వారా ప్రతి బాటిల్‌ను స్కాన్ చేసి అమ్మకాలు చేయాలని సూచించారు. బెల్ట్ షాపుల సమాచారంపై ఎక్సైజ్ సిబ్బంది చర్య తీసుకోకపోతే నేరుగా తన దృష్టికి తీసుకురావాలన్నారు. జేసీ మయూర్ అశోక్, జెడ్పీ సీఈవో నారాయణమూర్తి పాల్గొన్నారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన కల్పించండి

మహారాణిపేట: పీఎం సూర్య ఘర్ పథకంపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించి, ప్రతి ఇంటిపై సోలార్ విద్యుత్ యూనిట్ ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీఎం సూర్య ఘర్ పథకం అమలుపై శనివారం కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వచ్చే రెండు నెలల్లో జిల్లాలో 70 వేల పీఎం సూర్య ఘర్ యూనిట్లు ఏర్పాటుకు కృషి చేయాలన్నారు. ప్రతి నియోజకవర్గంలో 10 వేల యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా చర్యలు ముమ్మరం చేయాలన్నారు. ఈ పథకం పట్ల ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల ముందుకు రావడం లేదని, అందువల్ల విద్యుత్ శాఖ, గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు ప్రజల్లో అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. సచివాలయాల వారీగా లక్ష్యాలు నిర్దేశించి అమలు చేయించాలన్నారు. యూనిట్ల ఏర్పాటులో సహకరించిన గ్రామ వార్డు కార్యదర్శులకు వెండర్ల ద్వారా ఇన్సెంటివ్ కూడా అందిస్తామన్నారు. ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈ శ్యాంబాబు మాట్లాడుతూ.. ఒక కిలోవాట్ యూనిట్‌కు రూ.65,000 ఖర్చు అవుతుందని, ఇందులో రూ.30 వేల సబ్సిడీ ఉంటుందన్నారు. దీని ద్వారా 150 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. ఇంటి పైన కానీ, ఖాళీ ప్రదేశంలో 10X10 అడుగుల స్థలం అవసరం ఉంటుందన్నారు. రెండు కిలోవాట్ల యూనిట్‌కు రూ.1,25,000 వరకు ఖర్చు అవుతుందని, ఇందుకు ప్రభుత్వం రూ.60 వేల సబ్సిడీ ఇస్తుందన్నారు. దీని ద్వారా 240 యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వివరించారు. లబ్ధిదారులు వాడుకోగా మిగిలిన విద్యుత్‌ను 2.09 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, ఆరు శాతం వడ్డీకి బ్యాంకు రుణాలు ఇస్తాయన్నారు.

పేదోడి వైద్యంపై కూటమి నిర్లక్ష్యం

- 8 రోజులుగా ఎన్టీఆర్ వైద్య సేవ బంద్
- 18 రోజులుగా సమ్మెలో పీహెచ్‌సీ వైద్యులు
- ఇబ్బందులు పడుతున్న రోగులు



మహారాణిపేట: కూటమి ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యంపై తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. ప్రభుత్వ ఉదాసీన వైఖరి కారణంగా జిల్లాలో వైద్య సేవలు పూర్తిగా స్తంభించిపోయాయి. పట్టణాల్లో కార్పొరేట్ వైద్యాన్ని అందించే ఎన్టీఆర్ ఆరోగ్య సేవ నిలిచిపోగా.. పల్లెల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్‌సీ) వైద్యులు లేక బోసిపోయాయి. దీంతో వైద్యం అందక పేద రోగులు అల్లాడిపోతున్నారు.

బకాయిలు చెల్లించక ఆరోగ్యశ్రీ బంద్

జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.162 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడమే గత ఎనిమిది రోజులుగా ఆరోగ్యశ్రీ సేవలు నిలిచిపోయాయి. బకాయిలు తక్షణమే చెల్లించాలని ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఫలితం లేకపోయింది. దీంతో ఈనెల 10 నుంచే ఎన్టీఆర్ వైద్య సేవ సేవలను నెట్‌వర్క్ ఆస్పత్రులు నిలిపివేశాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సమ్మె చేస్తున్న ఆస్పత్రుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మొదట 27 ఆస్పత్రులు సేవలు నిలిపివేయగా, నేడు ఆ సంఖ్య 34కు పెరిగింది. బకాయిలు చెల్లించకుండా వైద్యం అందించలేమని ఆస్పత్రుల యాజమాన్యాలు తేల్చిచెప్పడంతో.. పేదలకు కార్పొరేట్ వైద్యం అందని ద్రాక్షగా మారింది. ప్రభుత్వ ఉద్యోగులు, జర్నలిస్టులకు సైతం వైద్యం అంతంత మాత్రంగానే అందుతోంది.

సమ్మెపై ఉదాసీనత : పట్టణాల్లో పరిస్థితి ఇలా ఉంటే.. పల్లెల్లో వైద్యం పూర్తిగా పడకేసింది. పీహెచ్‌సీ వైద్యులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 18 రోజులుగా సమ్మె చేస్తున్నా.. ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. జీవో నంబర్ 99 ద్వారా కోత విధించిన పీజీ కోటా పునరుద్ధరణ, పదోన్నతులు, అలవెన్సుల వంటి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వైద్యులు సమ్మెబాట పట్టారు. జిల్లాలోని భీమిలి, రేవిడి, ఆనందపురం, అర్. తాళ్లవలస, గాజువాక, పెదగంట్యాడ సహా 10 పీహెచ్‌సీల్లో 20 మంది వైద్యులు సమ్మెలో ఉండటంతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోజూ వందలాది మంది ఓపీ చూసే ఈ కేంద్రాలు ఇప్పుడు బోసిపోయాయి. వైద్యులు లేక స్టాఫ్ నర్సులు, ఫార్మసిస్టులే వైద్యుల అవతారం ఎత్తుతున్నారంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒకవైపు బకాయిలు చెల్లించక ఆరోగ్యశ్రీని, మరోవైపు వైద్యుల సమస్యలు పరిష్కరించక పీహెచ్‌సీలను నిర్వీర్యం చేస్తూ.. కూటమి ప్రభుత్వం పేదోడి ఆరోగ్యాన్ని గాలికి వదిలేసిందని ప్రజలు మండిపడుతున్నారు.

ఇళ్ల స్థలాల కోసం పోరాటం తప్పదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు



డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను పరిశీలిస్తున్న రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

మధురవాడ: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వకపోతే పోరాటం తప్పదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు హెచ్చరించారు. శనివారం ఆయన రుషికొండలో అదానీ డేటా సెంటర్‌కు కేటాయించిన భూములను ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, ఇతర నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విలువైన భూములను బడా కంపెనీలకు కేటాయించడం వల్ల పరిశ్రమలు లేవు, ఉపాధి లేదు అని విమర్శించారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా పట్టణాల్లో పేదలకు రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్ల స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటికీ నెరవేర్చలేదన్నారు. విశాఖలోనే 1.20 లక్షల మంది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకుని అధికారుల చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. భూములు తీసుకుని ఉత్పత్తి ప్రారంభించని సంస్థల నుంచి వాటిని వెంటనే వెనక్కి తీసుకుని పేదలకు ఇవ్వాలని, లేకపోతే తాము పోరాటానికి దిగుతామని శ్రీనివాసరావు హెచ్చరించారు. ఇళ్ల స్థలాల కోసం లోకేష్ సొంత నియోజకవర్గం మంగళగిరిలో శుక్రవారం పేదలు ఆందోళన చేశారని గుర్తుచేశారు. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతామని చెప్పి.. ఇప్పుడు అక్కడ 5 వేల మంది ఉద్యోగాలు తీసేసినా కూటమి నాయకులు ఇంకా కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు. పరిశీలనలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌కేఎస్‌వీ కుమార్, నాయకులు డి.అప్పలరాజు, నరేంద్రకుమార్, రాజ్‌కుమార్, గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి ఎరుగని శ్రమజీవి



అతని వయసు 93 ఏళ్లు. శతకానికి దగ్గర పడుతున్నా, విశ్రాంతి అన్న ఆలోచనే లేదు. శ్రీకాకుళానికి చెందిన పరదేశి అక్కయ్యపాలెం కుమ్మరవీధిలో స్థిరపడి, ఇప్పటికీ కుమ్మరి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ముఖ్యంగా దీపావళి పండగ నేపథ్యంలో ప్రమిదలు, చిచ్చుబుడ్డీలు తయారు చేస్తూ శ్రమైక్య జీవన సౌందర్యాన్ని చాటుకుంటున్నాడు.

\- ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

వెలుగుల వైభవం

- నగరంలో దీపావళి సందడి
- కళకళలాడుతున్న మార్కెట్లు
- బాణసంచా కొనుగోళ్ల జోరు



డాబాగార్డెన్స్: నగరంలో వెలుగుల పండగ దీపావళి సందడి నెలకొంది. చీకటిని పారద్రోలుతూ వెలుగులు తెచ్చే ఈ పండగ.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా నిలుస్తుంది. ఈ సందర్భంగా నగరవాసుల్లో కొత్త ఉత్సాహం వెల్లివిరుస్తోంది. ముఖ్యంగా బాణసంచా మార్కెట్ల వద్ద సందడి కనిపిస్తోంది. జీవీఎంసీ పరిధిలో 530 దుకాణాలకు అధికారులు అనుమతులు మంజూరు చేశారు. ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ గ్రౌండ్, ఏఎస్ రాజా గ్రౌండ్‌తో పాటు గోపాలపట్నం, మల్కాపురం, సుజాతనగర్, పెందుర్తి, గాజువాక, షీలానగర్, కంచరపాలెం, ఎన్ఏడీ కూడలి తదితర ముఖ్య ప్రాంతాల్లో స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఈ స్టాళ్ల వద్ద ప్రజలు తమకు నచ్చిన బాణసంచా సామగ్రిని కొనుగోలు చేస్తున్నారు. గ్రీన్ క్రాకర్లకు కూడా గిరాకీ కనిపిస్తోంది. పోలీసులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది స్టాల్స్ వద్ద నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి స్టాల్ వద్ద తప్పనిసరిగా నీరు, ఇసుక బకెట్లు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లను అందుబాటులో ఉంచాలని, రెండు స్టాళ్ల మధ్య నిర్దిష్ట దూరం పాటించాలని అధికారులు నిర్వాహకులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇక దీపావళి అంటే కేవలం బాణసంచా మాత్రమే కాదు.. లక్ష్మీ పూజ కూడా అత్యంత ప్రధానమైన ఘట్టం. ఈ నేపథ్యంలో నగరంలోని మార్కెట్లు పూజా సామగ్రి, ప్రమిదలతో కళకళలాడుతున్నాయి. సంప్రదాయ మట్టి ప్రమిదలతో పాటు, వివిధ రాష్ట్రాల నుంచి తెప్పించిన విభిన్న ఆకృతులు, రంగురంగుల డిజైన్లతో కూడిన అలంకరణ దీపాలు మార్కెట్లో లభిస్తున్నాయి.







బాణసంచా కొనుగోలు

'అనుమతి లేకుండా బాణసంచా విక్రయించవద్దు'

డాబాగార్డెన్స్: బాణసంచా సామగ్రిని అనధికారికంగా విక్రయిస్తే చర్యలు తప్పవని జీవీఎంసీ అగ్నిమాపక అధికారి కృపావరం హెచ్చరించారు. జీవీఎంసీ పరిధిలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను శనివారం పరిశీలించి, వ్యాపారులకు తగిన సూచనలు చేశామన్నారు. జీవీఎంసీ పరిధిలో బాణసంచా దుకాణాల ఏర్పాటుకు 535 దరఖాస్తులు రాగా.. ఐదింటిని తిరస్కరించినట్లు చెప్పారు. ఏయూ ఇంజినీరింగ్ గ్రౌండ్ వేదికగా 130, ఎంవీపీ కాలనీ ఏఎస్ రాజా గ్రౌండ్‌లో 48, ఓజోన్ వేలీలో 29తో పాటు గోపాలపట్నం, సుజాతనగర్, మల్కాపురం, గాజువాక తదితర ప్రాంతాల్లో దుకాణాల ఏర్పాటుకు సంబంధించి అందిన దరఖాస్తులు పరిశీలించి, కమిషనర్‌కు పంపించామన్నారు. ఆయన సూచనల మేరకు 530 దుకాణాలకు అనుమతులు మంజూరు చేశామన్నారు. దుకాణాల పరిశీలనలో జిల్లా అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

- అనుమతులు లేకుండా టపాసులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఒక ప్రకటనలలో హెచ్చరించారు. ఇప్పటికే అనుమతులు లేని వారిపై చట్టపర చర్యలు తీసుకున్నటు పేర్కొన్నారు.

ఛీ.. సేవలు బాలేవు!

భారతీయ రైల్వే... దూర ప్రయాణానికి అత్యంత చవకైన, సౌకర్యవంతమైన మార్గం. అయితే కోవిడ్ అనంతర ఆర్థిక సంస్కరణల పేరుతో వృద్ధుల రాయితీలు సహా పలు రాయితీలను రద్దు చేసిన రైల్వే మంత్రిత్వ శాఖ, ప్రయాణికులకు సేవలందించే విషయంలో మాత్రం అదే నిర్లక్ష్యాన్ని కొనసాగిస్తోంది. రైలు ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా, వాటిని పరిష్కరించి, పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవడంలో రైల్వే బోర్డు అలసత్వం ప్రదర్శిస్తోంది.







రైళ్లలో ఫిర్యాదులకు సంబంధించి ప్రయాణికులు అప్‌లోడ్ చేసిన ఫొటోలు

- రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా పెరుగుతున్న ఫిర్యాదులు
- 2023-24, 24-25లో దాదాపు 61 లక్షల ఫిర్యాదులు
- 2023-24తో పోలిస్తే 2024-25లో 11 శాతం పెరిగిన కంప్లైట్స్
- ప్రతి 4 ఫిర్యాదుల్లో ఒకటి భద్రతపైనే..
- గత వార్షికంలో రైలు ప్రయాణంలో భద్రతాలోపాలపై అత్యధికంగా 7.50 లక్షల ఫిర్యాదులు
- కోచ్‌లలో అపరిశుభ్ర వాతావరణంపైనా పెదవి విరిచిన 8.44 లక్షల మంది
- ట్రైన్ల సమయపాలనపై 15 శాతం తగ్గిన ఫిర్యాదులు



రిజర్వేషన్ బోగీలో బెర్త్ పరిస్థితి ఇది..

సాక్షి, విశాఖపట్నం: రెండేళ్ల కాలంలో (2023-24, 2024-25) రైల్వే సేవలపై దేశవ్యాప్తంగా ప్రయాణికులు ఏకంగా 60.96 లక్షలకు పైగా ఫిర్యాదులు చేశారు. 'రైల్ మదద్' హెల్ప్‌లైన్ (139), సోషల్ మీడియా, వెబ్‌సైట్ల ద్వారా ఈ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఫిర్యాదులలో అత్యధికంగా భద్రతా లోపాలపై ఉండటం గమనార్హం. గత వార్షిక సంవత్సరంలో (2024-25) భద్రతకు సంబంధించిన ఫిర్యా దులే ఏకంగా 7.50 లక్షల వరకు నమోదయ్యాయి. దీనికి అదనంగా రైళ్లలో పరిశుభ్రత లేమి, విద్యుత్ పరికరాల వైఫల్యాలు, ఆహారం నాణ్యతపైనా ప్రయాణికులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ ఒకవైపు.. లోపాలు మరొకవైపు

దేశంలో వందే భారత్, అమృత్ భారత్ వంటి అత్యాధునిక రైళ్లను ప్రవేశపెడుతూ రైల్వే శాఖ అప్‌గ్రేడ్ అవుతున్నా, రైలు ఎక్కిన దగ్గర నుంచి దిగే వరకూ ప్రయాణికులకు అందించే ప్రాథమిక సేవలైన సీటింగ్, శుభ్రత, నాణ్యమైన ఆహారం విషయంలో మాత్రం లోపాలు కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఆహారం నాణ్యతపై ఫిర్యాదులు వస్తున్నా వాటికి సరైన విధంగా స్పందించకపోవడం విమర్శలకు తావిస్తోంది. రాయితీలను రద్దు చేసి, ఆదాయాన్ని పెంచుకున్న రైల్వే శాఖ, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంలో, వారి ఫిర్యాదులను పరిష్కరించడంలో ఎందుకు నిర్లక్ష్యం వహిస్తుందనేది ప్రశ్నార్థకంగా మారింది.

ఆహారమంటే.. ఆమడ దూరం.!

రైల్వేలలో నాణ్యత లేని ఆహారం వడ్డించారనే ఫిర్యాదులు ఎప్పటికప్పుడు వస్తూనే ఉన్నాయి. అయినా ఆహారం అందిస్తున్న కాంట్రాక్టు సంస్థలపై చర్యలు మాత్రం.. నామమాత్రంగానే తీసుకుంటున్నారు. ప్రయాణికులకు అవసరమైన శుచి, రుచికరమైన ఆహారం అందించాలన్నదానిపై మాత్రం రైల్వే మంత్రిత్వ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. 2020-21లో 253 ఫిర్యాదులు మాత్రమే అందగా, 2021-22లో 1082కి పెరిగింది. ఫిర్యాదుల సంఖ్య ఏడాదికేడాది పెరుగుతూవస్తోంది. 2022-23లో 4421 ఫిర్యాదులు నమోదు కాగా, 2023-24లో 7026, 2024-25లో 6645కి చేరుకుంది. గత ఐదేళ్లలో ఒక్క ఫిర్యాదుకే తీవ్రంగా స్పందించిన రైల్వే శాఖ.. ఆహారం అందిస్తున్న కాంట్రాక్టు సంస్థ లైసెన్స్‌ని రద్దు చేసింది. 3137 ఫిర్యాదులకు జరిమానాలు విధించగా.. 9627 ఫిర్యాదుల్ని పరిగణనలోకి తీసుకొని సదరు కాంట్రాక్టు సంస్థలకు హెచ్చరికలతో సరిపెట్టింది. ట్రైన్లలో ఆహారం అందించేందుకు దేశ వ్యాప్తంగా 20 సంస్థలతో రైల్వే బోర్డు ఒప్పందాలు కుదుర్చుకుంది. అయినా కఠిన చర్యలు తీసుకోవడంలో మాత్రం రైల్వే మంత్రిత్వ శాఖ మీనమేషాలు లెక్కిస్తూ నాణ్యత లేని ఆహారం సరఫరా చేస్తున్న సంస్థలపై కనీస చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

భద్రత శూన్యం.. శుభ్రత మృగ్యం

2023-24లో రైల్వే సేవల్లోని అన్ని ఫిర్యాదులు కలిపి 28.96 లక్షలు వచ్చాయి. 2024-25 సంవత్సరంలో ఏకంగా 11 శాతానికిపైగా పెరిగి 32 లక్షలకు చేరుకుందంటే.. లోపం ఎంతలా ఉందో అర్థం చేసుకోవచ్చు. రైల్వే ప్రయాణంలో భద్రత అనేది ప్రయాణికులకు అతి పెద్ద సమస్యగా మారిందని ఫిర్యాదుల ద్వారా అవగతమవుతోంది. రైళ్లలో భద్రతకు సంబంధించిన ఫిర్యాదులు గతేడాదితో పోలిస్తే.. 64 శాతం వరకూ పెరిగాయి. 2023-24లో 4.57 లక్షల ఫిర్యాదులు భద్రతకు సంబంధించి కాగా.. 2024-25లో 7.50 లక్షలకు చేరుకోవడం బాధాకరం. ప్రతి నాలుగు ఫిర్యాదుల్లో ఒకటి భద్రతకు సంబంధించింది ఉండటం చూస్తే.. రైలు ప్రయాణికులు ఎంతలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారో స్పష్టమవుతోంది. అదేవిధంగా.. తర్వాత లోపం.. కోచ్‌లలో పరిశుభ్రత కరువవ్వడం. ఏడాది కాలంలో వచ్చిన ఫిర్యాదుల్లో కోచ్‌లలో అపరిశుభ్ర వాతావరణంపై 16.5శాతం వరకూ ఉంటున్నాయి. గతేడాదిలో ఏకంగా 8.44 లక్షల ఫిర్యాదులు అందాయి. విద్యుత్ పరికరాల వైఫల్యాలపైనా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. సమయపాలన గురించి ఫిర్యాదులపై 15 శాతం వరకూ తగ్గడం కాస్తా ఉపశమనం. 2023-24లో సమయపాలనపై 3.25 లక్షల కంప్లైంట్స్ రాగా.. 2024-25లో 2.77 లక్షలకు తగ్గడం విశేషం. రైల్వే స్టేషన్ల స్థాయి ఫిర్యాదులు కూడా తగ్గుముఖం పట్టాయి. 2023-24లో స్టేషన్ స్థాయి ఫిర్యాదులు 5.55 లక్షలు రాగా.. 2024-25లో 4.39 లక్షలకు తగ్గాయి.



రైలులో అందజేసిన నాసిరకం భోజనం

2023-24లో రైలు సేవలపై ఫిర్యాదులు- **28.96** లక్షలు
2024-25లో ఫిర్యాదులు **32** లక్షలు
భద్రతపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **7.50** లక్షలు
అపరిశుభ్రవాతావరణంపై వచ్చిన ఫిర్యాదులు- **8.44** లక్షలు
సమయపాలనపై 2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **2.77** లక్షలు
2020-21లో ఆహారంపై వచ్చిన ఫిర్యాదులు- **253**
2024-25లో వచ్చిన ఫిర్యాదులు- **6,645**

వక్ఫ్ రికార్డుల కంప్యూటరీకరణపై దిశానిర్దేశం



మాట్లాడుతున్న షేక్ మహమ్మద్ ఆలీ

సీతంపేట: ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ రికార్డుల కంప్యూటరీకరణపై ఓరియెంటేషన్ కార్యక్రమాలు నిర్వహించినట్లు వక్ఫ్ బోర్డ్ సీఈవో షేక్ మహమ్మద్ అలీ అన్నారు. అక్కయ్యపాలెంలోని మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ కమ్యూనిటీ హాల్‌లో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి ఎన్.మహమ్మద్ ఫరూఖ్ ఆదేశాల మేరకు.. ఉమ్మడి విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన ముతవల్లీ(కమిటీ)లు, నిర్వహణ కమిటీల కోసం వక్ఫ్ రికార్డుల కంప్యూటరీకరణపై దిశానిర్దేశం చేశామన్నారు. వక్ఫ్ రికార్డులు, ఆస్తులు, ఆదాయం నిర్వహణలో పారదర్శకతను పెంచడంతో పాటు, మిగిలిన ఆదాయాన్ని ముస్లిం సమాజ సంక్షేమం కోసం ఎలా ఉపయోగించాలో ముతవల్లీలకు వివరించినట్లు చెప్పారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేసే సమయంలో డీఆర్వో, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సహాయం తీసుకోవాలని సూచించామన్నారు. మిగులు ఆదాయాన్ని పేద, నిరుపేద ముస్లిం మహిళలు, వితంతువుల కోసం వినియోగించాలని నిర్ణయించామని, ఈ నిధులతో 'ఖాలీమే హునర్' అనే ఒక సంప్రదాయ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రతిపాదించినట్లు వివరించారు. ఇందులో భాగంగా విశాఖలోని హజరత్ ఇషాక్ ఆలీ మదీనా దర్గా దగ్గర ఉన్న భవనంలో శిక్షణ పొందిన వారికి ఒక కుట్టు మిషన్, సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. గౌరవ సభ్యులు డాక్టర్ రఫియా, ముక్రం ముజీబి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు

డాబాగార్డెన్స్: నగర ప్రజలు ఆనందంగా దీపావళి పర్వదినం జరుపుకోవాలని నగర మేయర్ పీలా శ్రీనివాసరావు, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ తెలిపారు. కాలుష్య రహిత దీపావళిగా, హరిత దీపావళిని స్వచ్ఛ దీపావళిగా జరుపుకోవాలని పేర్కొన్నారు. చంటి పిల్లలు, గుండె జబ్బులు గల వారికి, వృద్ధులకు ఎటువంటి హానీ కలగకుండా, భయభ్రాంతులకు గురిచేయకుండా పండగ చేసుకోవాలన్నారు. నగర ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

సృజనాత్మకత, ప్రణాళికతో నాయకత్వ వికాసం

మద్దిలపాలెం: సృజనాత్మకత, పటిష్ట ప్రణాళిక ద్వారానే నాయకత్వ వికాసం సాధ్యమని ఐఐటీ ఖరగ్‌పూర్ పూర్వ ఆచార్యులు, ఆర్‌జీయూకేటీ వ్యవస్థాపక వీసీ ఆచార్య ఆర్‌వీ రాజకుమార్ అన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలలో భాగంగా ఆయన 'ఒక ఆదర్శ విశ్వవిద్యాలయాన్ని సృష్టించడంలో నాయకత్వ సవాళ్లు' అనే అంశంపై ప్రసంగించారు. నిబద్ధత, దూరదృష్టితో పనిచేయాలని సూచించారు. ఆర్‌జీయూకేటీల స్థాపన, పరిమిత వనరులతో అభివృద్ధి, ఎదురైన సవాళ్లను ఆయన వివరించారు. తొలి బ్యాచ్ విద్యార్థులు జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సంతృప్తినిచ్చిందని తెలిపారు. ఏయూ పూర్వ విద్యార్థి అయిన ఆచార్య రాజకుమార్‌ను ఏయూ వీసీ ఆచార్య జీపీ రాజశేఖర్ సత్కరించారు.



చికెన్ ధరలు

చికెన్ (కిలో) (వెన్‌కాబ్)

ఫారం ధర	: రూ.125
బ్రాయిలర్ (లైవ్)	: రూ.145
స్కిన్	: రూ.260
స్కిన్‌లెస్	: రూ.270

కోడిగుడ్ల ధరలు

	రూ.లలో (వందకు)
విశాఖ	545.00
విజయనగరం	549.00
శ్రీకాకుళం	549.00

చిరు వ్యాపారిపైకి దూసుకొచ్చిన లారీ

- సంఘటన స్థలంలోనే దుర్మరణం
- ఆమె మనవడికి తీవ్ర గాయాలు



సాకేత్(ఫైల్)



అప్పయ్యమ్మ(ఫైల్)



లారీ కింద అప్పయ్యమ్మ కాలిభాగం

పెదగంట్యాడ: శనివారం.. తెలవారుతున్న వేళ.. ఓ చిరు వ్యాపారిపై మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. ఈ ఘటనలో ఆమె సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ఆమె మనవడు తీవ్రంగా గాయపడ్డాడు. వుడా డబుల్ రోడ్డులో శనివారం ఉదయం జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపిన వివరాలివి. పెదగంట్యాడ మండలం వియ్యపువానిపాలేనికి చెందిన వియ్యపు అప్పయ్యమ్మ (48) వుడా డబుల్ రోడ్డులో కొబ్బరిబొండాల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ప్రతి రోజూ ఉదయాన్నే ఆమె తన దుకాణాన్ని తెరుస్తూ ఉంటుంది. రోజూ మాదిరిగానే శనివారం ఉదయం ఆరు గంటల సమయంలో తన మనవుడు బంధం సాకేత్(5)తో కలసి దుకాణానికి వచ్చింది. అక్కడ కొబ్బరి బొండాలు సర్దుతుండగా శ్రీకాకుళం నుంచి పెదగంట్యాడకు ఇసుక లోడుతో వస్తున్న లారీ దుకాణంపైకి దూసుకొచ్చింది. దీంతో ఆమె అక్కడికక్కడే దుర్మరణం చెందగా ఆమె మనవడు సాకేత్ తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాద సంఘటన తెలిసిన వెంటనే వియ్యపువానిపాలేనికి చెందిన అప్పయ్యమ్మ బంధువులు అక్కడకు చేరుకున్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళనకు దిగారు. సమాచారం అందుకున్న న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ సూర్యనారాయణ సంఘటన స్థలానికి చేరుకున్నారు. అనకాపల్లికి చెందిన లారీ డ్రైవర్ బారా గోవింద్ (35)ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. గాయపడిన సాకేత్ స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతురాలి కుమారుడు వియ్యపు శ్రీను ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సూర్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు భవిష్యత్‌కు చదువే మూలం



ప్రతిజ్ఞ చేస్తున్న పాఠశాలల బాలికలు

- ఆడ బిడ్డలను తప్పనిసరిగా బడికి పంపించాలి
- కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

ఆరిలోవ: ఆడ బిడ్డలను ఇంటికే పరిమితం చేయకుండా.. తప్పకుండా చదివించాలని తల్లిదండ్రులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ సూచించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు. జిల్లాలో అన్ని మండలాల నుంచి ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న బాలికలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని బాలికలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడ బిడ్డలు బంగారంలాంటివారన్నారు. వారిని ఉన్నత చదువులు చదువుకోవడానికి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. కలలు సాధనకు, బంగారు భవిష్యత్‌కు చదువే మూలమన్నారు. బాలికలు క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. బాలికలకు ఎలాంటి సమస్యలు వచ్చినా టోల్‌ఫ్రీ నంబర్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు. అనంతరం ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పాఠశాలల్లో బాలికలకు జరిపిన వ్యాసరచన, క్విజ్ తదితర పోటీల్లో విజేతలకు కలెక్టర్ హరేందిర ప్రసాద్, డీఈవో ఎన్.ప్రేమకుమార్, ఐసీడీఎస్ పీడీ రామలక్ష్మితో కలసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఏపీసీ చంద్రశేఖర్, డిప్యూటీ డీఈవో, ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

బంతి.. ధరల కాంతి

- దీపావళి సందర్భంగా పెరిగిన ధర
- బుట్ట బంతి రూ.150
- కొనుగోలుకు పోటీపడిన వర్తకులు
- గిరి రైతుల ఆనందం



పాడేరు మార్కెట్ వద్ద బంతిపూలను కొనుగోలు చేసిన వ్యాపారులు

సాక్షి, పాడేరు: జిల్లాలో బంతి పూలకు భలే డిమాండ్ ఏర్పడింది. దీపావళి పండగ నేపథ్యంలో మన్యంలోని బంతిపూలకు గిరాకీ ఏర్పడింది.తెలుగు రాష్ట్రాలతో పాటు ఈఏడాది తొలిసారిగా ఒడిశాలోపలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు కూడా పూలను కొనుగోలు చేసేందుకు పోటీ పడ్డారు. పాడేరు పాత బస్టాండ్‌లో శనివారం మార్కెట్‌కు గిరిజనులు భారీగా బంతిపూలను తీసుకువచ్చారు. బుట్టడు బంతి పూలను రూ.150లకు వర్తకులు కొనుగోలు చేశారు. హుకుంపేట, పాడేరు, పెదబయలు, జి.మాడుగుల మండలాల పరిధిలోని పలు గ్రామాల గిరిజనులు ఉదయం నుంచే పూల అమ్మకాలను చేపట్టారు. మధ్యాహ్నం వరకు సీతమ్మకాటుక (చిన్నబంతి) రకం పూల వ్యాపారం పోటాపోటీగా జరిగింది. ముద్దబంతి పూలను బుట్ట రూ.100లకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన వ్యాపారులు ఈ పూలను కొనుగోలు చేసి విశాఖ, రాజమండ్రి, విజయవాడ, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాలకు తరలించారు. ఒడిశా వ్యాపారులు తమ రాష్ట్రానికి వ్యాన్ల ద్వారా పూలను రవాణా చేశారు.

పండగ వేళ ఆదాయం

దీపావళి పండగ సందర్భంగా బంతిపూల అమ్మకాలు పెరగడంతో గిరిజన రైతులకు మంచి ఆదాయం లభించింది. శుక్రవారం నుంచి బంతి పూల ధరలు పెరగడంతో బుట్ట పూలకు రూ.150 వరకూ ధర లభించింది. ప్రతి గిరిజన రైతు పాడేరు మార్కెట్‌లో రోజుకు ఐదు నుంచి పది బుట్టల వరకు బంతి పూలను విక్రయిస్తున్నారు. కార్తీక మాసం ప్రారంభం కానుండడంతో బంతిపూల ధర మరింత పెరగనుంది. ఒడిశా పూల వ్యాపారులు నేరుగా వాహనాలతో పాడేరు మార్కెట్‌కు వచ్చి బుట్ట పూలను రూ.150 ధరతో కొనుగోలు చేస్తుండడంతో పోటీ ఏర్పడింది. స్థానిక వ్యాపారులు కూడా అదే ధరతో కొనుగోలు చేస్తుండడంతో గిరిజన రైతులకు కలిసి వచ్చింది. గిరిజన రైతులు పూలసేకరణ,అమ్మకాలతో బిజీగా ఉన్నారు.